క్లుప్తంగా

నేడు వెంకటకృష్ణాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదకాకాని: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలనే ఆశయంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురం ఎంపీపీఎస్ ఈఎల్ఈ పాఠశాలలో బుధవారం జరిగే వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలియజేశారు.

నక్షత్ర వనం ఏర్పాటుకు భూమి పూజ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో నక్షత్ర వనం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు పాల్గొని పూజ చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

15 రోజుల్లో లేఅవుట్‌లకు అనుమతి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా దరఖాస్తు చేసే లేఅవుట్‌లకు 15 రోజుల్లో అనుమతులు ఇస్తామని, అనధికార లేఅవుట్స్ తొలగింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లే అవుట్ ఉండడానికి వీలులేదని, ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లే అవుట్‌కి 15 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అనధికార లే అవుట్స్‌ని రానున్న వారం రోజుల్లో తొలగించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. దరఖాస్తు చేసిన లే అవుట్ అనుమతుల్లో ఎటువంటి జాప్యం, లేదా సమస్యలు ఉన్నా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని, లేకుంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 లేదా, 9849908381 నంబర్‌కు వాట్సాప్ చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో పెండింగ్ ఉన్న సర్వే దరఖాస్తులను వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. కోర్ట్ కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, కంటెమ్ట్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్లు కోటయ్య, మహాపాత్రో, ఏసీపీలు అజయ్ కుమార్, టీపీఎస్‌లు, ఏఈ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ



నెహ్రూనగర్: రెడ్డి జన సేవాసమితి, రెడ్డి జనాభ్యుదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఉడుముల నర్సిరెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్‌లో మంగళవారం స్కాలర్‌షిప్పులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీసీ ఎక్స్‌పోర్ట్ జనరల్ మేనేజర్ వి.వెంకట్రామిరెడ్డి, మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ శీలం వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొని విద్యార్థులకు రూ. 7 లక్షల స్కాలర్‌షిప్పులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహాయం అందుకుని చదువులో రాణించాలన్నారు. చదువులేకపోతే భవిష్యత్తు లేదని పేర్కొన్నారు. నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలి సభ్యులు మోదుగుల పాపిరెడ్డి, చల్లా అంజిరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, కంది సంజీవరెడ్డి, వి.సాంబిరెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి, భవనం వెంకటరెడ్డి, లేళ్ల పెదఅప్పిరెడ్డి, సీతారామ్‌ప్రసాద్, శ్యామల కోటిరెడ్డి, దుగ్గెంపూడి సాంబశివారెడ్డి, ఒరుగంటి నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

పట్నంబజారు: ఆటోడ్రైవర్‌పై దాడిచేసిన వారిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఆటోస్టాండ్‌లో షేక్ బాషా అనే వ్యక్తికి సభ్యత్వం ఉంది. ఈక్రమంలో మంగళవారం గుర్తుతెలియని మరో ఆటోడ్రైవర్ స్టాండ్ వద్ద ఆటోను నిలిపాడు. బాషా స్టాండ్‌కు అడ్డంగా ఉన్న ఆటోను తొలగించాలన్నాడు. పూటుగా మద్యం సేవించి ఉన్న గుర్తుతెలియని ఆటో డ్రైవర్ బాషాను దుర్భాషలాడడంతో పాటు, రాడ్‌తో దాడిచేశాడు. బాషాకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా ఆరోగ్య రక్ష.. జగనన్న సురక్ష

గుంటూరు రూరల్: సచివాలయాల వారీగా అనారోగ్య సమస్యలు ఉన్న ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్షని సద్వినియోగం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు అవగాహన కల్పించాలని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎంతో ఖరీదైన వైద్యం, మందులు ఉచితంగా క్యాంప్‌లో అందించడం జరుగుతుందన్నారు. మండల వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి మాట్లాడుతూ జగనన్న విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాడన్నారు. కార్పొరేట్ వైద్యం, విద్యను ప్రతి పేదవానికి అందించేందుకు జగనన్న కృషిచేస్తున్నారన్నారు. క్యాంప్‌లో ఏర్పాటు చేసిన మహిళల, పురుషుల ప్రత్యేక కౌంటర్లు పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎవరికైనా ఉన్నత వైద్యం అవసరమైతే ప్రభుత్వ లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్‌తో పాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో భాగంగా బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలు, కీళ్ళ నొప్పులు, కళ్ళ సమస్యలకు పరీక్షలు చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఎంపీడీవో ఆదినారాయణ, సర్పంచ్ లలితకుమారి, ఎంపీటీసీలు రమేష్, ఉడతా భూలక్ష్మి, దాసుపాలెం సర్పంచ్ జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులున్నారు.



మంచాల జగనన్న ఆరోగ్య సురక్షలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

అందరి ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

బీకేపాలెం(కాకుమాను): రాష్ట్ర ప్రజలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బీకేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజలెవరు అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే సంకల్పంతో సీఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.శిబిరాలకు వచ్చే ప్రజలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ ఆరోగ్యంతోనే జీవితాలలో ఆనందం ఉంటుందని అలాంటి ఆనందాన్ని ప్రతి కుటుంబానికి అందిచాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గుల్జార్ బేగం, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ అసదుల్లా, గ్రామ సర్పంచ్ మెరిగల శాంతకుమారి, ఎంపీటీసీ పిచ్చమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షులు కొత్త అమేష్, మెరిగల మోహనరావు, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమకుమారి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి భరోసా

మంచాల(చేబ్రోలు): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు జగన్నన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శ్రీరామరక్షగా మారిందని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం కార్యక్రమం జరిగింది. స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన మెగా మెడికల్ క్యాంప్‌కు అనూహ్య స్పందన లభించింది. మెగా క్యాంప్‌లో స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందజేశారు. వివిధ స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి ఉచితంగా వైద్యం, మందులు అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే అభివృద్ధి సాధించినట్లు అన్నారు. ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించగలిగినట్లు తెలిపారు. హెల్త్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బాబురావు, గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, ఎంపీటీసీ తిరువీధుల అంజనాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు షేక్ పెదమస్తాన్, అన్నదాసు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మంచాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద వైద్య పరీక్షల కోసం అధిక సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులు



మంచాల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



బీకేపాలెం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

ఆర్‌వీఐటీ కళాశాల హెచ్‌వోడీ దినేష్‌బాబుకు పీహెచ్‌డీ



చేబ్రోలు: మండల కేంద్రం చేబ్రోలులోని ఆర్‌వీఐటీ కళాశాల సీఎస్‌ఈ హెచ్‌వోడీ ఉన్నవ దినేష్‌బాబు డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రావెళ్ల వెంకట కృష్ణయ్య మంగళవారం తెలిపారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన ఉన్నవ దినేష్‌బాబు చెన్నైలోని సవిత విశ్వవిద్యాలయం ద్వారా పీహెచ్‌డీని పొందారు. ఈయన డిస్ట్రిబ్యూటెడ్ లెర్నింగ్ బేస్‌డ్ బిగ్ డేటా ప్రాసెసింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై పరిశోధనలు చేశారు. నాలుగేళ్లలో డాక్టరేట్ సాధించిన దినేష్‌బాబును ఆర్‌వీఐటీ కళాశాలలో ఘనంగా సన్మానించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి, డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఆర్వీ కృష్ణయ్య, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరీ

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘం, 45వ వార్షికోత్సవం, వాగ్గేయకార మహోత్సవాలు ముగింపు సందర్భంగా పాలఘాట్ రాంప్రసాద్ బృందం చేసిన శాస్త్రీయ సంగీత కచేరీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీ త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రితో పాటు అనేక వాగ్గేయకార కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై ఎల్.రామకృష్ణన్, మృదంగంపై పి.ఫల్గున్ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను కార్యదర్శి నేతి విశ్వేశ్వర రావు, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, సహ కార్యదర్శి కృష్ణ కిశోరులు ఘనంగా సత్కరించారు. వల్లూరి కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీకి సత్కారం

నగరంపాలెం: లాలాపేట పీఎస్ పరిధిలోని మంత్రిబజార్‌లో సోమవారం నాలుగేళ్ల పఠాన్ షాహిద్‌అలీఖాన్ కిడ్నాప్‌కు గురవ్వగా.. గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించిన విషయం విదితమే.. ఈ కేసులో సత్వరమే స్పందించిన జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్‌ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నారీ సమాన్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షురాలు షేక్ సలీమా, సభ్యురాలు ఫైరోజ్‌లు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందర రావు, ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

రక్షమాం.. లోక పావని

శివాలయంలో ఎమ్మెల్యే కిలారి దంపతుల ప్రత్యేక పూజలు

పెదకాకాని: శివాలయానికి పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య దంపతులు విచ్చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఎమ్మెల్యే దంపతులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు, వేదపండితులు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య దంపతులను స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు.

పొన్నూరు: పట్టణంలోని ఆలయాల్లో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా మూడవరోజు అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవి రూపంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు, సిబ్బందిపర్యవేక్షించారు.



శివాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య దంపతులు



పెదకాకాని శివాలయంలో కూచిపూడి నృత్యప్రదర్శన



గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు

గాయత్రీదేవిగా శ్రీ కనకదుర్గ అమ్మవారు

పెదకాకాని: దసరా నవరాత్రుల సందర్భంగా శ్రీ దేవీనవరాత్రోత్సవాలు పెదకాకాని మండలంలో వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని గ్రామాలలో శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వెనిగండ్లలో కనకదుర్గమ్మ అమ్మవారిని మంగళవారం గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అర్చకులు రంగనాధబాబు తీర్థప్రసాదాలు అందజేశారు.



వెనిగండ్లలో గాయత్రీదేవి అలంకరణలో శ్రీ కనకదుర్గ అమ్మవారు

విజ్ఞాన్‌లో శరన్నవరాత్రి వేడుకలు

గుంటూరు రూరల్: దసరా శరన్నవరాత్రి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో తమ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తెలిపారు. మంగళవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృప తమ విద్యార్థులపై ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు. దసరా నవరాత్రుల సందర్భంగా కళాశాల విద్యార్థినులకు కోలాట నత్యం, సంప్రదాయ వస్త్ర ధారణ, దసరా వేషాల వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తునట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 20వ తేదీన సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

శలపాడులో అగ్ని ప్రమాదం



శలపాడులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పూరిల్లు, కాలిబూడిదైన వస్తు సామాగ్రి



ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ వేణుగోపాలరావు

పూరిల్లు దగ్ధం

శలపాడు(చేబ్రోలు): ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమవటంతో నిరుపేద కుటుంబం నిరాశ్రయులైన ఘటన చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని శలపాడు గ్రామానికి చెందిన పురుషోత్తపపట్నం కళ్యాణ్, నాగమణి దంపతులు పూరింట్లో నివసిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో క్షణాల్లో ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో ఇంటిలోని వస్తు సామాగ్రి, దుస్తులు, విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు, టీవీ, ఫ్రిజ్, మంచాలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. తెనాలి అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

శలపాడు గ్రామంలో అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కళ్యాణ్, నాగమణి కుటుంబానికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ సర్పంచ్ మన్నెం శిరీష, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావులు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. రూ. ఐదువేల నగదు, నిత్యావసర వస్తువులను అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేయనున్నట్లు మన్నెం వేణుగోపాలరావు తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై వర్క్‌షాప్



ప్రాగ్మాటిక్ సంస్థ సీఈవో భరత్

గుంటూరు రూరల్: అంకుర పరిశ్రమల స్థాపనల్లో వినూత్న ఆలోచనలే ప్రధాన పెట్టుబడని హైదరాబాద్‌కి చెందిన ప్రాగ్మాటిక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ భరత్ గుజవర్తి పేర్కొన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఐఐసీ సెల్, ఈఎండీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ యాజ్ కెరీర్ ఆపర్చునిటీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంకుర పరిశ్రమల స్థాపనలకు, వాటిని అంతర్జాతీయ దిశగా విజయపథంలో తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన అంశాలను వివరించారు. సాంకేతిక వ్యాపార రంగంలో విభిన్న ఆలోచనలతో జొమాటో, పేటీఎం, ఫ్లిప్‌కార్ట్ వంటి వ్యాపార సంస్థలు విజయ పథంలో దూసుకెళ్తున్నాయన్నారు. సాధారణ మానవునికి అవసరమైన సేవలను అందించేందుకు వినూత్న ఆలోచనలే పెట్టుబడులన్నారు. భారతదేశం ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్, చైనా తర్వాత ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ హబ్‌గా ర్యాంక్‌ని పొందిందన్నారు. టెక్నాలజీ రంగంలో 6జీ దిశగా టెరాబైట్ ఇంటర్నెట్ వేగం పుంజుకుందన్నారు. సాంకేతిక వ్యాపార రంగంలో డేటా సేకరణ అధిక ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణలు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరే విధంగా కృషిచేయాలన్నారు. తమ కళాశాలలో విద్యను అభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కంపెనీలు స్థాపించడం గర్వకారణమని ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్‌రావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, డాక్టర్ ఎన్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ కె.కార్తీక్‌పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకై క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి పర్యవేక్షణలో ఐటీఎం స్కిల్స్ అకాడమీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల్లో రాత, మౌఖిక పరీక్షల అనంతరం తొమ్మిది మందిని తదుపరి ప్రక్రియకు ఎంపిక చేశారు. జేకేసీ సమన్వయకర్త కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అభినందించారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరుఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీ కాలనీకి చెందిన షేక్ లాహెరా సెల్‌ఫోన్‌కు ఇటీవల వాట్సాప్‌లో లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా అవతలవారు టాస్క్ ఇచ్చారు. రూ. వెయ్యి చెల్లించి టాస్క్ పూర్తి చేస్తే రూ.1400 చెల్లిస్తామని చెప్పారు. లాహెరా మొదట టాస్క్ పూర్తి చేయడంతో రూ. 1400 వచ్చాయి. అనంతరం రూ. 3వేలు చెల్లించాలని గ్రూపు నిర్వాహకులు చెప్పారు. లాహెరా రూ. 3వేలు చెల్లించి టాస్క్ పూర్తి చేసింది. అయితే టాస్క్ పూర్తి కాలేదని గ్రూపు నిర్వాహకులు మెసేజ్ ఇచ్చి మరికొంత చెల్లించాలంటూ పలుమార్లు కోరారు. లాహెరా మెసేజ్‌లో వచ్చిన ప్రకారం మొత్తం రూ.79 వేలు చెల్లించింది. తనకు రావాల్సిన డబ్బులు నిర్వాహకులు ఇవ్వకపోడంతో తాను మోసపోయినట్లు గుర్తించి, బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లేస్‌మెంట్ బ్రోచర్లు ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పలు కళాశాలల ప్లేస్‌మెంట్ బ్రోచర్లను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల పూర్తి సమాచారంతో రూపొందించిన ప్లేస్‌మెంట్ బ్రోచర్లు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు సులభంగా లభించేందుకు దోహదం చేస్తాయన్నారు. యూనివర్సిటీ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, ఆర్కిటెక్చర్ కళాశాల, వ్యాయామ విద్య కళాశాలల బ్రోచర్లు ఆవిష్కరించడం జరిగిందన్నారు. కరోనా తర్వాత జరిగిన 2020-21, 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ బ్రోచర్లను ఆయా కంపెనీలకు పంపి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెక్టార్ ఆచార్య, ప్రిన్సిపాల్స్ పి.సిద్ధయ్య, ఆచార్య పి.జాన్సన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జీవీఎస్‌ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.